కథానిక

# వలపు పరీక్షలు

అకసరాల రామకృష్ణరావు

"సుశీల గారికి,

స్వతంత్రించి లేఖ వ్రాస్తున్నందుకు క్షమించాలి. ఆడదానికి పరాయి మొగవాడు లేఖ వ్రాసినంత మాత్రాన అనుమాన పడేరోజులు పోయాయని, మీ లాంటి వార్ని అలాంటి లెఖ్ఖల్లో వెయ్యకూడదని, తెలిసి వ్రాస్తున్నాను. వ్రాయక పోదును గాని నా ఆఖరి అక్షరాలైనా మీ అరుణ హస్తాలలో శాశ్వతంగా, నే నొకడిని ఉండేవాడినని జ్ఞాపకార్థంగా ఉంటాయని వ్రాస్తున్నాను. కురిసి వెలుస్తేగాని ఆకాశం నిర్మల మవనట్లు, నా బాధ మీకు చెప్పుకుంటేనేగాని నా హృదయారాటం తీరదు. మన కష్టసుఖాలచే యింకొకర్ని నొప్పించ కూడదన్నంత స్వార్థత్యాగిని కాను నేను. ఈ అంతిమ క్షణాలలోనైనా నాకు మీపైగల అనురాగం, తిరిగి అనుగ్రహింపబడని నా ప్రేమవేదన - మొదటినుంచీ మిమ్మల్ని ప్రేమించి ఎన్నో ఆశలు పెట్టుకొని- ఒక్కసారిగా మీ ప్రేమ భాగస్థుడు, అత్యుత్తమ పుణ్యాలు చేసిన అదృష్టవంతుడు నేను కానసీ, "మీ బావ" అని తెలిసిన తరువాత... నేననుభవించిన మనోవేదన, యిక యీ ప్రపంచంలో బ్రతికి భరించ లేననుకుంటున్నాను మీరు వివాహమాడబోయే మీబావతో అమర సుఖం అనుభవించమని ఆశీర్వదిస్తూ, యీ జీవి ఆఖరికోరికగా ఎంతో విలువయిన మీ వేడికన్నీటి చుక్కలు రెండు ఖర్చు పెట్టమని కోరుతూ ముగిస్తున్నాను...

ప్రసాద్"—

ఈ ఉత్తరం చదవగానే పదహారేళ్ళ సుశీల పడుచు హృదయం గిలగిల లాడిపోయింది. చేతులు వణుకుతున్నాయి. హృదయం 'ధన్ ధన్' మని వికృతంగా, భారంగా, కొట్టుకుంటోంది. అయిదునిముషాల సేపు ఆ సుందరి "అచేతన" అయిపోంది: ఆమె ప్రేమ పరీక్ష పర్యవసానం ప్రాణంమీదకి వచ్చింది! అంతలో తెలివి తెచ్చుకుని "లెటర్ పేడ్", పెన్నూ తీసుకుని సుశీల యిలా వ్రాయడం మొదలుపెట్టింది,

"శ్రీ ప్రసాదుగారికి,

మిమ్మల్ని పరీక్షిద్దామని నేను చేసిన చిన్న చిలిపిపనికి మీరింతగా బాధపడతారని, మీ హృదయం ఇంత క్రుంగుతుందని నేను జన్మలో అనుకోలేదు, అనుకుంటే ఇలా చేద్దునా?

కొంటెతనానికో, పెంకితనానికో మనం జీవితంలో చేసే చిలిపిచేష్టకు యావజ్జీవితం విచారించేలా ఇంతింత దారుణఫలితాలు ఉంటాయని నాకిప్పుడే తెలుస్తోంది?

ఏవేవో వెర్రి స్వాభిప్రాయాలు వెల్లడించి అసలు విషయాన్ని దాస్తున్నానేమో. క్షమించాలి. అసలు నాకు ఎవరితోటీ పెళ్ళి నిశ్చయమవలేదు. నేనెవర్నీ ప్రేమించలేదు. ఇంతెందుకు? నాకసలు ఓ బావంటూ లేనేలేడు. ఆవేళ, అంటే మనం రైల్లో కలుసుకుని పరస్పర పరిచయం చేసుకున్నప్పుడే, ఆ కొద్దిక్షణాలలోనే, మీ మాటల మాధుర్యం చూసో, మీ చూపుల చాతుర్యం చూసో నా హృదయం మీకు అంకితమయిపోయింది.

ఎవరూలేని ఆ సెకండ్ క్లాసు కంపార్ట్‌మెంటులో నన్ను విడిచి ఎంతో దూరంగా కూర్చుని ఎంతో మర్యాదగా, సభ్యతగా, మీ మాటలు, చేష్టలు, అణకువ ఆనాడే నన్ను మీదాన్ని చేసేయి. మీ యందు నాకెంత ప్రేమఉందో నాకు తెలుసు కాని మీరు నన్నెంతలా ప్రేమించారో, అది అన్యాంకిత మయితే ఎంత బాధ పడతారోనని ఒక పరీక్ష పెట్టేను. కాని ఏం లాభం? ప్రేమ పరీక్ష పర్యవసానం విషమించి ప్రాణంమీదకి తెస్తుందనుకోలేదు.

నిర్భాగ్యురాల్ని! మీకోసం రెండుకాదు. కొన్ని లక్షల కన్నీటి చుక్కలు ఖర్చుపెట్టినా నాకోసం ఆత్మార్పణచేసిన మీగురించి మిమ్మల్ని కలుసుకోనేదాకా నాకీబాధ తప్పదు, నాశోక స్రవంతి కట్టదు.

మీకీ ఉత్తరం అందుతుందనే వ్రాస్తున్నానా? ఏమో నాకే తెలియదు. నా అదృష్టం పండి, నా నోములు ఫలించి, నా ఆశలు చిగిర్చి మీకీ ఉత్తరం సకాలంలో అందుతే అదృష్టవంతురాల్ని. లేదా పెళ్ళికాని వితంతువుని. యావజ్జీవకన్యని...

ఇంతకన్న ఏం వ్రాయను?

—సుశీల"

* * *

ప్రపంచంలో ఒక మనిషిమీద యింకొక మనిషి ఆధారపడుతూంటాడు. ఆ రెండో మనిషి బ్రతుకు విచారపూరితమైతే మొదటి మనిషి జీవితం విషాదభూయిష్టమే. జానకిరామయ్యగారి పని అలానే అయింది.

సుందరమ్మ పోతూపోతూ, రెండోపెళ్ళి చేసుకోవద్దని చేతిలో చెయ్యి వేయించుకుని, సుశీలను జానకిరామయ్యగారి కప్పగించి కళ్లు మూసింది. నిజానికి అప్పటికి జానకిరామయ్యగారికి ముప్ఫై ఏళ్ళు నిండాలేవు. అయితేనేం, కూతురిమీద అభిమానంచేత, ఎందరు ప్రోత్సహించినా, పెళ్లి చేసుకోకుండా స్వసుఖం త్యాగంచేసి సుశీలను పెద్దదాన్ని చేశేడు. సుశీల ఆనందమే తన ఆనందం! తన ముద్దుబిడ్డ సౌఖ్యమే తన సౌఖ్యం!

నాలుగురోజులయింది, సుశీల సరిగ్గా అన్నం తినడం లేదు, కాలేజీకి వెళ్లడం లేదు. తనతో రోజూలా చలాకీగా, హాయిగా క్లాసు కబుర్లు చెప్పడంలేదు. సాయంకాలం ఎందరు ఫ్రెండ్స్ వచ్చి బ్రతిమాలినా క్లబ్‌కు వెళ్లడంలేదు. పోస్టుమేన్ పిలుపు వినేసరికి అన్నం తింటున్నా వదిలేసి వీధిలోకి పరిగెట్టడం, ఉత్తరం లేక విచారంగా వచ్చేయ్యడం. ఏమిటి దీనిభావం? ఎవరేమన్నారు? ఏమంటే చెప్పదు. జానకిరామయ్యగారి ప్రాణం గిలగిల లాడిపోయింది!

ఆ రోజు సాయంకాలం జానకిరామయ్యగారు వీధి గదిలో కూర్చుని కోర్టు కాగితాలు చూసుకుంటున్నారు. ఒక్కసారిగా సుశీల 'గొల్లు' మని ఏడుస్తున్నట్లు వినపడి లోపలికి పరిగెత్తేరు. సుశీల ఏదో లేఖను చూసి వెక్కి వెక్కి ఏడుస్తోంది. జానకిరామయ్యగారు ఆదుర్దాగా ఆ లేఖను చదివేరు. అందులోని సారాంశం, గత ఆదివారం రాత్రి ప్రసాదు అనే అతను నూతిలోపడి ఆత్మహత్య చేసుకున్నాడనీ, అతడు ఆ యింటికి పెద్దకొడుకనీ, అతని చావుకు కారణం సుశీలేననీ ఆమెను దూషిస్తూ, ప్రసాదు తమ్ముడు వ్రాశాడు.

జానకిరామయ్యగారికేమీ పాలుపోలేదు. సుశీల ఏడుస్తూ జరిగిందంతా చెప్పింది. ఆయన సుశీలని ఏమనగలడు?

పదహారేళ్ళ సుశీలలో ఊహించలేనంత వైరాగ్యం ఎలావచ్చిందో ఆ చుట్టుప్రక్కలవారెవరూ గమనించలేకపోయారు. ఆమె మునపటిలా నవ్వడమే లేదు. ఆమొహంలో చిరునవ్వుకు స్థానమే పోయింది. జానకిరామయ్యగారు ఆమె ఆనందంకోసం విశ్వప్రయత్నాలు చేసేడు. ఎన్నో సంబంధాలు తీసుకువచ్చాడు. కాని సుశీల ఇష్టమే తన ఇష్టం, ఆమెకి ఇష్టం లేకపోతే తనకెలా ఉంటుంది? ఆరు నెలలు గడిచిపోయాయి.

సుశీల మొహం అటువైపు తిప్పుకుని గదిలో పడుకుంది. జానకిరామయ్యగారు హడావిడిగా వచ్చేరు.

"అదేమిటమ్మా, ఇంకా అలాగే ఉన్నావా? నేను కోర్టునుంచి పంపిన కబురందలేదూ? వారు వచ్చేశారు."

"ఎవరు నాన్నా?"

"ఇంకెవరూ? పెళ్ళివారు. లే, లే. మంచి చీర కట్టుకో" అప్రయత్నంగా సుశీల రెండు కళ్ళూ నీళ్ళతో నిండిపోయాయి.

"నన్ను బాధించడం నీకిష్టమా నాన్నా? నేను పెళ్ళే చేసుకోనని చెప్పలేదా నాన్నా?" అంది ఏడుస్తూ.

జానకిరామయ్యగారికి కూడా, కూతురు దుఃఖపడుతోందని దుఃఖం వచ్చేసింది.

"అలాగే తల్లీ యింకెప్పుడూ పిలవనులే. కుర్రాడు అందంగా ఉన్నాడని పిలిపించాను. ఏంచేసినా నీకోసమే తల్లీ" అని కళ్ళ నీళ్లు

తుడుచుకొని "చాలాదూరంనుంచి వచ్చారు. కొంచెం కాఫీ చేసియియ్యి తల్లీ, మళ్లీ రాత్రి ప్యాసెంజరులో వెళ్ళిపోతారు లే..." అని వీధి గదిలోకి వెళ్ళిపోయాడు.

సబ్బూ, తువ్వాలూతీసుకుని సుశీల పెరట్లోకి వెళ్ళి మొహం కడుక్కొని, వంటింట్లోకి వచ్చి కాఫీలు కలిపింది. "వచ్చినవారుఎందరే?" అని రాని నడిగింది. తల్లీ తండ్రీ అబ్బాయి మొత్తం ముగ్గురుట!

పెద్దవాళ్ళకు కాఫీ యిచ్చింది. వాళ్లు నాన్న దగ్గిర కూర్చుని ఏదో మాట్లాడుతున్నారు. పెళ్ళికొడుకు వేరుగా, నడవలో కుర్చీ మీద కూర్చుంటే కాఫీ యిస్తూ అప్రయత్నంగా మొహంలోకి చూసింది. ప్రసాద్! సందేహం లేదు! ఆయనే బ్రతికే ఉన్నారా? తనకంత అదృష్టమా?

"ఎంతలా మారిపోయేవు సుశీ...నీ ఉత్తరం క్షణం ఆలస్యంగా వస్తే నే నేమైపోయి ఉందునో. నీ ఉత్తరం చూసిన తరువాత "నీ యావజ్జీవిత బ్రహ్మచర్యం" కాస్త పరీక్షిద్దామని నాకూ బుద్ధి పుట్టింది. అందుకే నువ్వు బావని సృష్టించినట్టే నేనూ తమ్ముణ్ణి సృష్టించి కథ నడిపేను. కాని ఎంతయినా పురుషుణ్ణి! నువ్వే మైపోతావోనని ఆట్టే రోజులు ఆగలేక పోయాను సుశీ! ఇక్కడ సంబంధం ఉందని మావాళ్ళని తీసుకొచ్చేను!"

హటాత్తుగా సంభవించిన యీ ఆనందంలో ఆశ్చర్యంలో సుశీల మాట్లాడలేక పోయింది. పరుగుపరుగున వీధి గదిలోకి వెళ్ళి చిన్న పిల్లలా నాన్న మెడచుట్టూ చేతులువేసి "నువ్వు తెచ్చిన సంబంధం నాకు నచ్చింది నాన్నా!" అంది. ఆ తండ్రి హృదయం పొంగిపోయింది.

వ్యక్తులు: ప్రకృతులు

# గట్లు తెగని నీటిగమనం

ఈ. ఈశ్వర్

ఆ విషయంలోనే తెగదు ఎన్నిసార్లు వాదించుకున్నా, వీళ్ళిద్దరికీ. పోనీ అనుకుని వాద నేనా మానుకుంటారా అనుకుంటే అదీ చెయ్యరు. కాని, చందూ కొంచెం నిర్లక్ష్యం మనిషి కాబట్టి ఎంత తెగక పోయినా, ఓ సరికి ఆపేసి పడుక్కుందుకేనా పోతాడు. కాని, సుబ్బయ్య మాత్రం మొండి ఘటం. పట్టుమీద పట్టు దట్టిస్తూనే వుంటాడు, కాని మనిషిని కదల నియ్యడు. చందూకి సిగరెట్టు పెట్టి పూర్తయ్యే సరికి మెల్లిగా కదలిక కలుగుతుంది. సుబ్బయ్య గారి పొడుం డబ్బా సారంగం. మూడురోజులకి సరిపడ ముందుగానే దట్టించి మరీ సిద్ధమౌతాడు మా అరుగు మీదకి. మా తాత కట్టించిన, అరుగు సార్థకమయినందుకు నేను సంతోషించినా, ప్రక్క కటకటాల సావిట్లో మంద మారుతం సేవిస్తూ శయనించాలని ఉబలాటపడే నాకు వీళ్లు కొంత చికాకు కలిగిస్తూనే వుంటారు నిజానికి.

ఇంతకీ చెప్పొచ్చే మాటేమిటంటే, రంజన రావు గురించి వీళ్ళిద్దరూ తెగ గుంజాటన పడి పోతున్నారు. ఇవాళ పూర్ణమేమో. వీళ్ళ హుషారుకి మరింత వెలుగు కలిగింది. చందూ చెప్పేదేమో మూడు ముక్కల్లో సూటిగా చెప్పేస్తాడు. నిజంగా ఆలోచిస్తే వాడితో ఏకీభవిస్తే సరే; లేకపోతే, "అబ్బాయీ! నేను నీతో ఏకీభవించజాలనందుకు చింతిస్తున్నాను" అని చెప్పేసేనా తప్పుకోవాలి. వాడితో వాదించడము అనవసరం. కారణం, వాడంత సూటిగా స్వచ్ఛంగా, ఖచ్చితంగా చెప్పేస్తాడు, చెప్పే మాటేమిటో. వాడు సాధారణంగా అనాలోచితంగానూ అనడు, తీవ్రంగా ఏదీ ఆలోచనా చెయ్యడు. కాని వాడి నమ్మకాలు వాడి